కథానిక

# డిబ్బరాజ్యంలో జనాభా సమస్య

కొడవటిగంటి కుటుంబరావు

'ఎన్నాళ్లకు, ఎన్నాళ్లకు!' అన్నారు డిబ్బ ప్రభువుగారు నన్ను చూసి.

'ఎంతమాట, ఎంతమాట!' అన్నాను.

'సమయానికి వచ్చారు. మహా సముద్రంలో ఉన్నాం!' అన్నారు ప్రభువుగారు. అది ఆయన మామూలు ధోరణి. నేను ఏరోజు ఏవేళప్పుడు వెళ్లినా ఆయన ఆమాటే అంటారు. సగం, ఆయన మంచితనం. సగం ఆయన అన్న మాట అక్షరాలా నిజంకూడానూ. డిబ్బరాజ్యం చిన్నదే అయినా అక్కడ ఎప్పుడూ ఏవో సమస్యలు, ఏదో ఆడావుడి, ఏవేవో రాజకీయాలు, ఏమేమిటో సంస్కరణలు, సమావేశాలు, విచారణలు, సంప్రతింపులు, తీర్మానాలు, ఉద్యమాలు—డిబ్బరాజ్యంలో లోటు కనపడకపోవటమన్నది ఉండదు.

'ఏవో పెద్ద ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఎవరన్నా అధికార్లుగాని వస్తున్నారా ఏమిటి?' అన్నాను, చుట్టూతా కలయ జూసి.

ఒకపక్క పెద్ద బల్లమీద తెల్లని గుడ్డ పరిచారు. చుట్టూ కుర్చీలు పది పన్నెండు అమర్చారు. బల్లమీద గాజు బుడ్లలో పూలు అమర్చారు. కొంచెం ఎడంగా గొయ్యతొట్టిలో బంగారు రంగు మూతలుగల సీసాలు నాలుగైదు మంచుగడ్డల మధ్య ఊపిరి పిలుస్తున్నాయి.

'మరేం లేదు. అమెరికానుంచి నలుగురు ప్రవీణులను పిలిపించాం. వారిమీదనే అన్ని ఆశలూ పెట్టుకున్నాం,' అన్నారు డిబ్బప్రభువుగారు.

'వీరు ఏ విషయమైన ప్రవీణులై ఉంటారో,' అన్నాను.

'మన కిటీవల జనాభా సమస్య ఒకటి ఏర్పడింది గాదూ?' అన్నారాయన.

జనాభా లెక్కలు వేయించటానికి అమెరికానుంచి ప్రవీణులు రావాలా అనుకున్నాను. కాని తప్పు నాది! డిబ్బప్రభువుగారిని వేధిస్తున్నది జనాభా లెక్కల సమస్య కానేకాదు. న్యాయంగా దాన్ని ఆహార సమస్య అనాలి. పాఠకుల సౌకర్యం కోసం డిబ్బరాజ్యం గురించి కొద్ది లెక్కలు యిస్తున్నాను.

ఇటీవల వేసిన అంచనాలనుబట్టి డిబ్బరాజ్యంలో 18,523 మంది ప్రజలున్నారు. వీరిలో 12,500 మంది రైతు తరగతికిచెందినవారు. మిగిలినవారిలో 20 మంది వ్యాపారాలు వగైరా చేసేవారు, 1 మంది చిన్న పెద్ద పరిశ్రమలు నడిపేవారు, 16 మంది పరిపాలన సాగించేవారు.

డిబ్బరాజుగారి తాతగారి హయాంలో అయిదువేల ఎకరాలు సాగవుతూ ఉండేవి. పదిహేనువేల ఎకరాల అడివి ఉండేది. ఇప్పుడు అయిదువేల ఎకరాలు అడివి ఉన్నది. విస్తృతమైన కలప పరిశ్రమా, కట్టెల పరిశ్రమా, బొగ్గు పరిశ్రమా-రాక్షసి బొగ్గు కాదు, కట్టెబొగ్గు పరిశ్రమ-ఉన్నాయి. ఇవాళ డిబ్బరాజ్యం ఏ మూలకు వెళ్లినా బీళ్ళమధ్య నల్లటి బొగ్గు రాసులు ప్రకృతి శోభను ఇనుమడింప జేస్తూ ఉంటాయి. ప్రస్తుతం సాగవుతున్న భూమి రెండువేల ఎకరాలు.

ప్రపంచమంతటా ఏర్పడ్డట్టే డిబ్బరాజ్యంలో కూడా ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం ఆహార కొరత ఏర్పడింది. యుద్ధం ముగిసిన సంవత్సరం క్షామం వచ్చింది. ఆమీదట రేషనింగు ప్రవేశపెట్టారు. రేషనింగు పెట్టినమీదట ఉన్న ఆహారధాన్యాలు నలుగురికీ చాలవన్నది బయట పడింది. ఎందుకంటే ఏ వారమూ రేషను షాపుల్లో నాలుగురోజుల అనంతరం గింజ మిగిలేది కాదు. ఆ తరవాత చీకటి బజారులో మాత్రమే ధాన్యం లభించేది.

సరే నిపుణులను పిలిపించారు. వారు తలా ఒకవిధంగానూ చెప్పారు. ఒకరు పండే పంట అందరికీ సమంగా పంచితే అందరికీ తగినంత ఆహారం ఉందన్నారు. దీన్ని ఆర్థిక శాస్త్ర

వేత్తలు కొట్టేశారు. అందరికీ సరిపడే ఆహారమే ఉంటే దొంగ వ్యాపారానికి అవకాశం ఎందుకుండాలి? అందుచేత అధికాహారోత్పత్తి ఉద్యమం సాగించమని మరికొందరు సలహా ఇచ్చారు. దిబ్బప్రభుత్వం అధికాహారోత్పత్తికి నడుం కట్టింది.

కాని ఈ ఉద్యమం కొనసాగించటానికి చాలా అవాంతరాలు వచ్చాయి. చాలామంది రైతులు, భూమిలోకి అడుగుపెట్టే అవకాశం దొరికితే ఆ భూమి తనదే ననటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ విధంగా భూమిమీద తిష్ఠవేసిన వారిని లోగడ బయటికి తరమవలసి వచ్చింది. వారికి భూములు పప్పగించటం అసంభవం. పొలాలు దున్నటానికి అర్హత గలవారంతా దున్నుతూనే ఉన్నారు. అందుచేత అధికాహారోత్పత్తి కింద బోలెడంత ద్రవ్యం వ్యయమైనా తగిన ఫలితాలివ్వలేదు.

'ధాన్యం ధరలు తగ్గిస్తే పేదవాళ్లుకూడా కొనుక్కోగలుగుతారు. ధాన్యం ఉన్నంతవరకైనా సరిగా అమ్ముడు పోనప్పుడు అధికాహారోత్పత్తి సాగించి ఏం ప్రయోజనం?' అని ఒకరన్నారు.

ప్రజల క్షేమమే తన క్షేమంగా భావించే ప్రభువుగారు ధాన్యం ధరలపై తీవ్రమైన కంట్రోల్లు పెట్టారు. దానివల్ల సమస్య మొదటికి వచ్చింది ఆ ధరలు తమకు గిట్టవన్నారు రైతులు. వాళ్లు తమ ధాన్యాన్ని చాటుగా ఎక్కువ ఖరీదుకు అమ్ముకున్నారు. తీవ్రమైన క్షామం ఏర్పడింది. జనం చచ్చారు. దిబ్బరాజ్యంలో జనం రోజూ తిండికి లేక చస్తున్నారన్న వార్త పదే పదే పత్రికల్లో కనిపించసాగింది.

ఏ రోజు తన పరిపాలన కింద తిండిలేక ఎందరు చస్తున్నదీ తెలుసుకుందామనే ఉద్దేశంతో ప్రభువుగారు రోజూ పత్రిక తిరగేసే సందర్భంలో ఒకనాడు గొప్ప మేధావి అయిన విదేశీ నిపుణుడు పత్రికల్లో ప్రచురించిన వ్యాసం ఒకటి ప్రభువుగారి కళ్లబడింది. ఆహార సమస్య -ప్రత్యేకించి ఆసియా రాజ్యాలలో గల ఆహార సమస్య - కేవలమూ జనాభా సమస్యే అనిన్నీ, ఈ దేశాల ప్రజలు పుట్టటం తగ్గించకపోయినా చావటం హెచ్చించకపోయినా ఈ సమస్య ఇంకా క్లిష్టమవుతుందనీ, ఇది స్వాతంత్ర్యానికీ, డెమోక్రసీకీ, సాంఘికాభ్యుదయానికీ, 'కోల్డువారు'కూ, విదేశీ వాణిజ్యానికీ గొడ్డలి పెట్టుగా ఉండగలదనిన్నీ, పెసిఫిక్ రక్షణ యావత్తూ, ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ సమస్య మీదనే ఆధారపడివున్నదనిన్నీ, దీన్ని పరిమార్చకపోతే ఆసియా ఖండమంతా కమ్యూనిజం వాతపడుతుందనీ ఆ మేధావి తెలిపాడు.

ఈ విషయాలు అచ్చులో - అందులోనూ ఇంగ్లీషు అచ్చులో - చూశాక దిబ్బప్రభువుగారు సత్వరచర్య తీసుకోక తప్పింది కాదు. కేబిలుమీద కేబిలు వెళ్లింది. విమానాలు ఎగిరాయి. రైళ్లు పరిగెత్తాయి. కారులు పరిగెత్తాయి. అమెరికను జనాభా నిపుణులు దిబ్బరాజ్యంలో వచ్చి వాలారు. పెద్దడాక్టరు అలికిడి వినగానే రోగి నిరుత్సాహం మాయమైనట్టు వీరిని చూడగానే ప్రభువుగారి ఆందోళన యావత్తూ మటుమాయమయింది. ఎట్లాగైనా దొరలు దొరలే! వాళ్లు ఒక్క క్షణం విశ్రాంతి తీసుకోలేదు. కారెక్కి రాజ్యం నాలుగుమూలలా తిరిగారు. కొన్ని ప్రదేశాలు టేపులలో కొలిచారు. కొన్ని కొన్ని చోట్ల మట్టితీసి పరీక్షించారు. అక్కడక్కడా ఫొటోలు ఎత్తారు. తుపాకులు తీసుకుని అడవిలోకి పోయి కొన్ని పిట్టలనూ, కుందేళ్ళనూ చంపారు. ఇవాళ భోజనాలదగ్గిర వాళ్లు తమ రిపోర్టు ఇవ్వనున్నారు.

నాకీ వివరాలన్నీ ప్రభువుగారు చెప్పటం పూర్తి అయే క్షణంలోనే నిపుణులు వచ్చారు. వెంటనే అందరమూ భోజనాలకు కూర్చున్నాం. దొరలుగాక నేనూ మరి అయిదారుగురు సంస్థానాధికారులూ పంక్తిలో ఉన్నాం.

అమెరికను నిపుణులు నలుగురున్నారు కాని భోజన సమయంలో మాతో మాట్లాడింది ఒక్కడే.

మల్తూజియన్ సిద్ధాంతం ప్రకారం ఈ రాజ్యం జనాభా ఏనాడో భూసారాన్ని మించి పెరిగిపోయింది' అన్నాడు నిపుణుడు.

'ఇక్కడి భూములు ఎంత మందిని భరించగలవు?' అన్నాను.

నా అమాయిక ప్రశ్నకు కాబోలు ఆయన నవ్వి, 'ఇక్కడి జనాభా ఎంతో నాకు సరిగా తెలీదు. అందులో సగం మందిని ఈ భూములు భరించగలవు. మిగిలిన సగం మందీ-' వాళ్లకు తాను జవాబుదారీ కానట్టు ఆయన భుజాలెగ రేశాడు.

'కొత్తభూమిని సాగులోకి తెస్తే?' అన్నాడొక ఉద్యోగి.

'ఏమవుతుందీ? భూమి బాంకులో డబ్బు లాంటిది. అది తీసినకొద్దీ తరుగుతుంది. కొత్త భూమి సాగులోకి రావాలంటే అడివి కొట్టెయ్యాలి. అది పాత భూములకు చేటు. కొత్త భూమి ఫిక్సెడ్ డిపాజిట్ లాటిది. దానికి నాగలి తగలగానే, గింజ పడగానే దాని సారం హరించిపోతుంది. మనిషి శరీరానికి సరాయి రోగం ఎటువంటిదో భూమికి సేద్యం అటువంటిది. భూమిలో సారం పుష్కలంగా ఉండాలంటే సేద్యం చెయ్యనే కూడదు' అన్నాడు నిపుణుడు.

ప్రభువు గారికే ఆశ్చర్యం వేసింది.

'ఈ భూముల్లో మా ముత్తాతగారి కాలం నుంచి సేద్యం జరుగుతున్నది. పొలాలు వెనకటి కన్న బాగా పండుతున్నాయి గాని తక్కువ పండటం లేదు' అన్నారాయన.

'అది నిజమే, అప్పుడు నీటివసతి లేదు. మంచి ఎరువు లేదు. మంచి విత్తనాలు లేవు. ఈ అభివృద్ధి ఫలితంగా పంట పెరిగింది. కాని ఈ పెరుగుదల ఎన్నాళ్లని! ఎక్కడో ఒకచోట ప్రకృతి తిరగబడి తీరుతుంది. ఒక్క ఎరువు తీసుకోండి. పది రూపాయల ఎరువు వేస్తే ఇరవై రూపాయల అదనపు పంట పండవచ్చు. నూరు రూపాయల ఎరువు వేస్తే నూరు రూపాయల అదనపు పంట పండదు. ఒక్క ఎకరం లోనే ప్రపంచానికి సరిపోయే పంట పండించటం సాధ్యమవుతుంది-ఎన్నికోట్లు దానిమీద ఖర్చు పెడితే మాత్రం!'

ఇది సబబుగానే కనపడింది. ఎట్లాగైనా నిపుణులు, అందులోనూ తెల్లవాళ్లు.

'అయితే ఇంతకూ ఏం సలహా చెబుతారు?'

'జనాభా తగ్గాలి!... మీరు మంచి ప్రభువులై ఉండవచ్చు. మీ ప్రజలకు మేలు చేద్దామని మీరు ఆరోగ్య సౌకర్యాలు చేసి ఉండవచ్చు. అందువల్ల ప్రజల ఆయుఃప్రమాణం పెరిగి ఉండవచ్చు. మీరు చేసింది మేలనుకుంటున్నారు. కాదు కాదు, పిల్లలకు టీకాలు వేయిస్తున్నారు. మసూచికంతో చచ్చేవాళ్ళ సంఖ్య తగ్గుతున్నది. కలరా ఇంజెక్షన్లిప్పిస్తున్నారు. కలరాతో చావ దగినంత మంది చావటం లేదు. ప్రజలను చదువుకోనిస్తున్నారు, వాళ్లు ఆరోగ్య విధులు తెలుసుకుని మలేరియాకు క్వైనైను వాడటమూ, కాచిన నీరు తాగి టైఫాయిడు మొదలైనవి రాకుండా చేసుకోవటమూ మొదలైనవి నేరుస్తారు. దీనికి తగ్గట్టుగా మీ గాంధీ - క్షమించండి - మీకు అహింస నేర్పాడు. మీ నెహ్రూ కూడా అహింసే నంటున్నాడు. ఈ అహింస మీ కొంప నిలువునా తీసేస్తుంది. జ్ఞాపకం ఉంచుకోండి. గర్భ నిరోధనా కేంద్రాలు పెట్టమనీ, పిల్లల మీద భారంగా పన్నులు వెయ్యమనీ నా సలహా.'

దిబ్బప్రభువుగారు పెద్ద భారం దిగిపోయినట్లు నిట్టూర్చారు. ఇప్పుడంతా స్పష్టంగా అర్థమవుతున్నది. ఆయన ముందుకు వంగి 'మరొక్క చిన్న సలహా కూడా కావాలి. ఇది మిమ్మల్ని అడుగుదామనుకోలేదు గాని తీరా వచ్చారు గనక—' అన్నారు.

'అడగండి. కానీ అదనపు ఖర్చు లేకుండా చెబుతాను. వ్యాపారం వ్యాపారమే, స్నేహం స్నేహమే' అన్నాడు నిపుణుడు.

'నా స్వంత ధాన్యపు కొట్లలో అయిదారు వేల టన్నుల ధాన్యం మిగిలి ఉంది. అప్పటికీ కొంత అమ్మాను. ఏం చెయ్యను? నా ప్రజలకు కొనుగోలు శక్తి లేదు. ఇంకో నెలలో కొత్త పంట రానే వస్తుంది. ఏం చెయ్యటానికీ పాలుపోవటం లేదు.' అన్నారు ప్రభువుగారు.

నిపుణుడు మీసాలు దువ్వుకుంటూ కనుబొమలు ముడేసి ఆలోచించి, 'టన్నుకు నాలుగు గాలనుల కిరసనాయిలు చొప్పున ఇరవై, లేక పాతిక వేల గాలనుల కిరసనాయిలూ, ఒక అగ్గిపుల్లా!... అన్నట్టు బంగాళాదుంపలు మొదలైనవేమైనా ఉంటే వాటికి నీలిరంగు వేయించండి అప్పుడు వాటినెవరూ ముట్టరు. మేం మా అమెరికాలో ఈ పనే చేస్తాం!' అన్నాడు.